నిజం కోసం

తహసిల్‌దారుగారు ప్రచండుడు. గుమాస్తాలచేత గట్టిగా పని చేయిస్తాడు. బహు నిక్కచ్చిమనిషి. న్యాయంగానూ ధర్మంగానూ ప్రవర్తిస్తాడనీ కాస్తకూ కూస్తకూ చెయ్యిచాపే స్వభావం కలవాడు కాదనీ ప్రతీతి.

గుమాస్తాలకు ఆయనంటే హడలు. ముఖ్యంగా ఎవరికైనా సెలవు కావలసివస్తే ఆయన దగ్గరకు పోవటానికి భయం. ఎవరైనా సాహసించి పోయి అడిగినా ఆయన ఇయ్యడు. పైగా ఏదో కారణం చూపి చీవాట్లు పెట్టి పంపిస్తాడు.

ఏ గుమాస్తాకైనా సెలవు కావలిస్తే అతనికి అమాంతం టైఫాయిడ్ జ్వరం అన్నా వస్తుంది; తండ్రి రైలు క్రింద అయినా పడిపోతాడు. లేకపోతే తల్లికి ప్రాణం మీదికి అయినా వస్తుంది. అంతేకాని మామూలుగా పని ఉంది అని గాని, పుట్టింట ఉన్న భార్యను చూచి వస్తాననిగాని వ్రాస్తే సెలవు దొరకదు.

గట్టి కారణం చెప్పినా కూడా ఆ చెప్పిన విషయం నిజమా అబద్ధమా అని ఆయన రహస్యంగా విచారణ చేయటం కూడా ఉంది. కాబట్టి ఆయనతో అబద్ధం చెప్పవలసి వచ్చినపుడు చాలా జాగ్రత్తపడి దాన్ని అభేద్యమైన దాన్నిగా చెయ్యాలె.

ఆ ఆఫీసులో మొన్నమొన్ననే ప్రవేశించిన ప్రసాదుకు ఈ వ్యవహారం అంతా తెలియదు. అందుకనే అతడు మామూలు అబద్ధం ఆడి ప్రాణం మీదికి తెచ్చుకొన్నాడు.

ప్రసాద్ బొత్తిగా చిన్నవాడు. పాతికేళ్ళకు లోపు. కులాసాగా ఉంటాడు. టీకుటాకుగా దుస్తులు వేసుకొని ఆఫీసుకు వస్తాడు.

ప్రసాద్ ఆఫీసుకు వచ్చిన రోజునే అంతా అనుకొన్నారు. 'ఎబ్బే, తాలూకా గుమాస్తా పనికి ఇతడు పనికిరాడూ' అని. లేకపోతే ఆ టీవి ఏమిటి? తాలూకా గుమాస్తా అంత టీవిగా నడవటం ఇంతవరకు ఎవ్వరూ చూడలేదుట. తహసీల్‌దారులూ, డిప్యూటీ కలక్టరులూ నడిచే నడక అది. తనకెందుకూ.

తలవంచుకొని మాట్లాడటంవల్ల వినయమూ, నమ్రతాగల మనిషేమోనని అనిపిస్తుంది. కాని అమ్మో, అదంతా దొంగవేషం అని హెడ్ గుమాస్తా అప్పుడే కనిపెట్టి అందరితోనూ రహస్యంగా చెప్పేశాడు.

ఆఫీసులో అన్ని మూలలా అతనిని గురించి గుసగుసలు బయలుదేరినవి. మొత్తంమీద అంతా కలిసి అనుకొన్నది ఏమిటీ అంటే, ఇతనేమో ఉండేరకం కాదని.

❖ ❖ ❖

ప్రసాద్ ఉద్యోగంలో చేరిన నెలలోపున ఓరోజున ఆవూళ్ళో టెన్నిస్‌పందాలు పెట్టారు. గొప్పగొప్ప వాళ్ళంతా వస్తున్నారు. ప్రసాద్ టెన్నిస్ కాస్త బాగాను ఆడుతాడు. ఆడటం ఎల్లాగున్నా టెన్నిస్ అంటే అతడు చెవి కోసుకొంటాడు. ఆ రోజున వెళ్ళి చూడాలె. ఆఫీసరు సెలవు ఇయ్యడు. ఎల్లాగ వెళ్ళటం? అదీ సమస్య!

ప్రసాద్ ఆరు రూపాయలుపెట్టి టిక్కెట్టుకొన్నాడు – ఆ సంగతి మాత్రం ఎవ్వరికీ తెలియనివ్వలేదు. రెండు రోజులు ఇట్టే గడిచిపోయినయి. ఇక ఆ రోజు సాయంత్రమే ఆటలు ప్రారంభం. మూడు గంటలకల్లా తాను అక్కడ ఉండాలె.

ప్రసాద్ ఇల్లా అనుకొన్నాడు. తాను వెళ్ళకపోతే ఏమీ మర్యాదగా ఉండదు. తన బాధ ఎల్లాగున్నా అందరూ 'ప్రసాద్ ఏడీ ప్రసాద్ ఏడీ' అని అడుగుతారు. తాను లేకపోతే వాళ్ళంతా. 'ఛీ! ప్రసాద్ లేకపోతే ఆడటానికి మాకేం ఉత్సాహంగా ఉంటుంది' అని అంటారు కూడాను. వాళ్ళు అనుకోటం ఎల్లాగున్నా తాను మాత్రం ఆటచూడకుండా ఎట్లా ఉండగలడు? ఏదో కారణం చెప్పి ఒంటిగంటకల్లా సెలవు సంపాదించి తీరాలని నిశ్చయించుకొని మరీ వెళ్ళాడు ఆఫీసుకు ఆ రోజున ప్రసాద్.

బల్లదులిపి కుర్చీలో కూర్చున్నాడు. ముందు 'ట్రే'లో కాయితాలు బోలెడు ఉన్నయి. వాటినన్నిటినీ సమాదరణ చేసి పంపేసెయ్యాలె. ఇప్పుడయ్యేపని అది?

ఒక కాయితం తీశాడు. బందిలదొడ్డిలో గేదె ఒకటి చచ్చిపోయిందట? తీసి పారవేయటానికి అనుమతికోసం వ్రాశాడు ఒక ఊరి కరణం. చచ్చినగేదెను ఈడ్చి అవతల పారెయ్యటానికి తహసీల్‌దారుగారి అనుమతి ఎందుకో? ప్రసాద్‌కు ఈ పద్ధతి అంటే అసహ్యం కలిగింది.

ఇట్లాగే ఉంటయ్యి ఆ కాగితాలన్నీ అనుకొన్నాడు. మంచిదుస్తులు వేసుకొని కుర్చీలో కూర్చుని పేరుపొందిన ఆటగాళ్ళ టెన్నిస్ ఆటచూస్తూ ఆనందించవలసిన తనకు ఈ కాగితాలు చూడవలసిన కర్మం పట్టింది. ప్రసాద్ చాలా విచారపడ్డాడు.

అప్పుడే ఒంటిగంట కావస్తున్నది. ఈపాటికి టెన్నిస్ కోర్టులో జనం

కిటకిటలాడుతూ ఉంటారు. ప్రాణం పీకుతున్నది వెళ్ళాలని. ఎల్లాగ వెళ్ళటం? ప్రసాద్ ఆలోచించాడు.

నిజం చెబితే ఆఫీసరు పోనియ్యడు?

ఏదో అబద్ధం చెప్పాలె.

ఏమి చెబుదామా అని ప్రసాద్ తీవ్రంగా ఆలోచించాడు. చిన్నతనంలో తాను విద్యార్థిగా నున్న రోజులలో సెలవు కావాలంటే ఏదో అబద్ధం చెప్పి క్లాసులోనుంచి వెళ్ళిపోయిన రోజులున్నయి. కాని అప్పుడు ఏ అబద్ధం చెప్పినా తీరిపోయేది. కణతలు నొక్కిపట్టుకొని 'తలనొప్పి అండీ మాస్టారూ' అంటే పాపం ఆయన 'ఇంటికెళ్ళి పడుకో, పో' అని చెప్పి పంపేసేవాడు. పాఠశాలలో ఉపాధ్యాయులతో చెప్పే అబద్ధాలు ఇక్కడ ఏమీ పనికివచ్చేటట్టు లేదు.

ఆ ఉపాధ్యాయులైనా గట్టి అబద్ధాలను ఎట్లాగ కట్టాలో తనకు నేర్పలేదు. ఎంతసేపటికీ 'నిజం చెప్పు, నిజం చెప్పు' అనేవాళ్ళు. నిజం చెప్పటమే అలవాటు అయినవాడు, ఈ ప్రపంచంలో ఎందుకూ పనికిరాడు. కాకపోతే మళ్ళీ ఆ బడిపంతులు పనే చెయ్యాలి. అందుకు మాత్రం పనికి వస్తాడు!

ప్రసాద్ కాగితాలు అవతలకు నెట్టి తల అరచేతులలో ఆనించి, సెలవు సంపాదించటానికి ఏమి చెబుదామా అని మళ్ళీ ఇంకొకసారి గట్టిగా ఆలోచించాడు. ఏమీ లాభం లేకపోయింది. ఏమైనా ఆలోచనతోస్తేగా? ఛీ, తన చదువంతా ఎందుకూ పనికిరాకుండా పోయింది?

తళ్ళికోట యుద్ధానికి నాలుగు కారణాలు వ్రాయి అని అడుగుతారు పరీక్షలలో. ఆ కారణాలు ఏవో కూడా నేర్పుతారు తనకిప్పుడు నాలుగు కాదు; పధ్నాలుగు కారణాలు వచ్చు. కాని ఎందుకొచ్చిన చదువు అది? సెలవు సంపాదించటానికి ఆఫీసరుతో ఆడవలసిన నాలుగురకాల గట్టి అబద్ధాలు నేర్పి ఉన్నట్లయితే తనకిప్పుడు ఎంతో ఉపయోగంగా ఉండేది.

ప్రసాద్ విసుగుతో అనుకొన్న మాటలు కావు ఇవి. హృదయపూర్వకంగానే అల్లాంటి చదువు తాను నేర్చి ఉన్నట్లయితే ఎంతో బాగుండేది అని అనుకొన్నాడు. సరే, ఇప్పుడు తాను తన తెలివి తేటలను ఉపయోగించే మాంచి కారణాన్ని ఒకదానిని కనిపెట్టాలె.

ఒంటిగంట అయింది. కాని ప్రసాద్‌కు చెప్పదగిన కారణం ఏమీ తట్టలేదు. 'తల నొప్పిగా ఉంది. ఇంటికి వెళ్ళి పడుకొంటాను' అనాలని తోచింది కాని – ఇంకొక కారణం తోచందే చచ్చి! ఎవరినైనా అడిగి తెలుసుకొను విషయం కూడా కాదాయె ఇది?

❖ ❖ ❖

తలనొప్పిగా ఉందంటే, ఆఫీసరు ఒక సారిడాన్‌మాత్రా, ఓ కప్పు కాఫీ కూడా ఇచ్చి 'కాసేపు రికార్డు రూములో పడుకో, తగ్గిపోతుంది' అంటాడు. లాభం లేదు. ఇక ఏదైనా జబ్బును పట్టుకురావాలె. తాను వచ్చి నెల అయినా కాలేదు. ఆ రామారావు వచ్చిన రోజున ఆఫీసుకు పోకుండా అతనితో కులాసాగా కాలక్షేపం చెయ్యటానికి బంక విరోచనాలు వచ్చినయ్యి. మరో రోజున కడుపునొప్పి రానే వచ్చె? ఇంకా ఏం జబ్బులున్నయో కూడా ప్రసాదుకు జ్ఞాపకం రాలేదు. చెవులో పోటు ఒకటి ఉంది. కాని, దాన్ని ఉంచుకోవాలె, ఎప్పుడైనా మరీ అవసరంవస్తే వాడు కొంటానికి.

ఇకపోతే ఇంకా మంచిమంచి జబ్బులు ఏమున్నాయా అని ప్రసాద్ గట్టి ఆలోచనే చేశాడు. కాని సమయానికి జ్ఞాపకం వచ్చి చావందే? ఛీ, ఛీ వెధవ సంగతులన్నీ ఇట్టే జ్ఞాపకానికి వస్తయి, పానిపట్టు యుద్ధానికి కారణాలు, అలహాబాదు సంధి షరతులూ ఇవన్నీ? కాని తనకు అత్యవసరమైన విషయాలు జ్ఞాపకానికి రావాయె? పోనీ అకారాది జబ్బుల పట్టిక అయినా ఒకటి ఉంటే బాగుండును అనుకొన్నాడు ప్రసాద్ ఆ సమయంలో.

అయినా అతడు ప్రయత్నం చేశాడు 'ఆ' దగ్గరనుంచి 'హ' దాకా ఉన్న అక్షరాలతో ప్రారంభం అయ్యే జబ్బులు ఏవి అవి? ఈ ప్రయత్నంలో అతడు విఫలుడైనాడనే చెప్పాలె.

కొన్ని అక్షరాలు మాత్రమే జబ్బు అక్షరాలు, 'అ' అజీర్ణం. 'ఆ' మీద జబ్బు ఏమీ కనపడలేదు. 'అ' అక్షరం వదిలేయాలి. ఇల్లాగ ఎన్నో అక్షరాలు వదిలేయాల్సిసి వచ్చింది. 'ఉ' మీద ఉన్మాదం ఉంది. అయితేనేం? అంతే. 'ఏఐ' 'ఒఓ' 'ఔ'ల మీరద జబ్బులేమీ లేవు. అచ్చులన్నీ ఇట్లాగే ఏడ్సినయి. తరువాత హల్లులు మీద కాస్తనయమేు. పైత్యం, వికారం, డోకులు, వాంతులు, నంజు, జలోదరం మొదలైనవి ఉన్నవి. కాకిని

తనకు ప్రస్తుతం అక్కరకు వచ్చేవి మాత్రంకావు. ప్రసాదు చాలా చికాకుపడ్డాడు. కణతలు నొక్కుకుంటూ అల్లాగ దిగాలపడి కుర్చీలో కూర్చున్నాడు. పాపం, అతని అవస్థను తలచుకొంటే ఎవరికైనా జాలి కలుగుతుంది. సెలవు సంపాదించటానికి ఒక్క కారణం దొరక్కపోయెను పాపం ఈ చిన్నవాడికి?

❖ ❖ ❖

ఒంటిగంటన్నర అయింది. ప్రసాద్ కుర్చీలోనుంచి లేచి అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్ళి ఆఫీసరు ముందు నిలబడ్డాడు, సెలవు అడగటానికి.

ఆఫీసరు మంచి సంతోషంతో ఉన్నారు. ఆయన ప్రసాదును చూచి ఆహ్వానపూర్వకంగా చిరునవ్వు నవ్వి ఏం కావాలన్నాడు. ప్రసాదు మాట్లాడలేదు.

మాట్లాడక క్రింది చూపులు చూస్తూ బిక్కముఖంతో నిలబడ్డాడు.

ఆఫీసరు ఇల్లాంటి వాళ్ళను ఎంతమందినో చూచిన అనుభవజ్ఞుడు. సంగతి ఇట్టే గ్రహించి, సెలవు కావాలా? అని అడిగాడు. ప్రసాదు చిరునవ్వుతో అదేసంగతి అన్నట్లు తల ఊపాడు.

ఎందుకూ? అని అడిగాడు ఆఫీసరు. ప్రసాదు దుఃఖంతో 'మా ఆవిడ..........' అని ఆ వాక్యం పూర్తిచేయలేక పోయినాడు. 'ఆ ఏమిటయ్యా, మీ ఆవిడకేమిటి చెప్పు? అని అడిగాడు ఆఫీసర్. ప్రసాదు వంచిన తల ఎత్తకుండా కంఠగాద్గ్యంతో 'నొప్పులు వొచ్చినయ్యండి. ఆసుపత్రికి పంపి వచ్చాను ఎల్లాగుందోనని దిగులుగా ఉ ంది' అన్నాడు.

ఆఫీసరుకు కాస్త నవ్వొచ్చింది. ఆ కుఱ్ఱవాడి ఆదుర్దాను చూచి. కొద్దిగా జాలిపడ్డాడు. అయితే ఈ మాత్రానికి మెత్తపడి ఆ కుఱ్ఱవాడికి సెలవు ఇస్తే రేపటినుంచి అందరి పెళ్ళాలూ చటుక్కున గర్భిణీలు అవుతారు. రోజుకు ఒకడు మా ఆవిడకు నొప్పులొచ్చినయి అంటూ సిద్ధం అవుతారు. అందుకని ఈ మాత్రానికి సెలవు ఇయ్యకూడదు. ఈ నిశ్చయానికి వచ్చి ఆఫీసరు అన్నాడూ, 'మిస్టర్ ప్రసాదు, నీ పెళ్లాము నీళ్ళాడుతూ ఉంటే నీవెందుకయ్యా. అక్కడ? నీవు చేయవలసినపని ఏమీల ఉండదు. ఆసుపత్రిలో చేర్చానంటూ ఉంటివి. ఇంకా భయం ఎందుకూ? అక్కడ డాక్టర్లూ మంత్రసానులూ ఉంటారు. నీవు వెళ్ళటం అనవసరం' అన్నాడు.

మామూలు కేసు అయితే ఆదుర్దా ఉండనక్కరలేదు కాని, మా ఆవిడ జబ్బు మనిషండి, అందుకనే'.

"ఏం జబ్బు?"

"గుండెజబ్బు అని డాక్టరు చెప్పాడు! ఆ చెంబెడునీళ్ళూ పోసికొని కోడలు మళ్ళీ జనంలో పడితే కొబ్బరికాయలు కొడతానని మా అమ్మ దేవుడికి మొక్కుకున్నదికూడాను."

"ఇంకేం"

"అందుకనే నాకు భయంగా ఉంది. సెలవు ఇస్తే వెళ్ళి చూస్తాను" అన్నాడు ప్రసాదు వినయంగా.

ఆఫీసరుకు ఆ క్షణంలో కాస్తజాలివేసిన మాట నిజము. కాని ఆ కుఱ్ఱవాడికి సెలవు ఇయ్యటం మాత్రం అతనికి ఇష్టం లేదు. ఇప్పుడు వెళ్ళి అతనక్కడ చేసేది ఏమీలేదు. ఇల్లాగ ఆయన అనుకొన్నాడు.

ఆఫీసరు కొంచెము ఆలోచిస్తున్నట్లు నటించి చివరకు అయితే ఇంకో అరగంట అయిన తరువాత నాకు కనపడు. ఏ సంగతీ చెబుతాను అని చెప్పి ఆ కుఱ్ఱగుమాస్తాను పంపించి వేశాడు.

ప్రసాదు దిగులుగా వచ్చి తనకుర్చీలో కూర్చున్నాడు.

❖ ❖ ❖

అప్పటికే రెండు అయింది. మూడింటికల్లా టెన్నిస్ మాచెస్ ప్రారంభిస్తారు. ఆఫీసరు సెలవు ఇస్తేగదా తాను వెళ్ళటం? ఛీ ఎంత అవస్థ వచ్చింది. అరగంట ఎప్పుడు అవుతుందా అని ప్రసాదు నిమిషాలు లెక్కపెడుతూ కూర్చున్నాడు. ఆ రోజున ఆ అరగంట అవటానికి రెండు గంటలు పట్టింది.

చివరకు ఎట్లాగయితేనేం గోడగడియారం దయదలచి అరగంట కొట్టింది.

కొట్టేకొట్టటంతోనే ప్రసాదు లేచి ఆఫీసరు గదిలోకి వెళ్ళి ఆయన ఎదటనిలబడ్డాడు.

ఆఫీసరు ప్రసాదు వంక వాత్సల్యంతో చూచాడు, పైకిమాత్రం గాంభీర్యాన్ని ప్రకటిస్తూ.

ఆయన ఏమంటాడోనని ప్రసాదు భయపడుతూ దిగులుగా నుంచున్నాడు.

ఆఫీసరు చిరునవ్వుతో, 'మిస్టర్ ప్రసాదు! నేను ఆసుపత్రికి టెలిఫోన్ చేసి కనుక్కొన్నాను. మీ ఆవిడ కులాసాగా వుంది. ప్రసాదు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి చూచి మర్యాదకు అనాలిసినమాట, 'థ్యాంక్యూ సర్' అన్నాడు.

ఆఫీసరు మళ్ళీ, 'మీ ఆవిడకు ఏమీ జబ్బులేదనీ, సుఖంగా ప్రసవిస్తుందనీ కూడా డాక్టరు చెప్పాడు.' అని, ప్రసాదువంక ఏదో జవాబును ఆశిస్తున్న వాడీలాగ చూశాడు.

ప్రసాద్ మళ్ళీ, 'థ్యాంక్యూ సార్' అని ఊరుకొన్నాడు. అప్రయత్నంగా అతని పెదవులపైకి ఒక చిరునవ్వు దూకింది. తప్పు, ఇప్పుడు నవ్వవలసిన సమయం కాదని చెప్పి, ప్రసాదు ఆ చిరనవ్వును లోపలికి నెట్టివేశాడు.

ఆఫీసరు ముఖంలో కవళికలు మారినై. నవ్వుపోయి, గాంభీర్యము కమ్ముకొన్నది. కటువుగా అన్నాడు. మీ ఆవిడ సుఖంగా ఉంటే జబ్బు అని ఎందుకు చెప్పావూ?

ప్రసాదు భయపడిపోయి ఏమీ మాట్లాడలేదు.

"అబద్ధమేనా నీవు చెప్పింది?"

ప్రసాదు తల ఎత్తలేదు. పెదవి విప్పలేదు. సిగ్గుపడిపోయినాడు.

'ఊ, నిజం చెప్పు, అబద్ధం అడావాలేదా?' ఉరిమి చూశాడు అధికారి.

ప్రసాద్ అబద్ధాలాడటంలో ఆరితేరిన చెయ్యికాదు. అందుకని తలవంచుకొనే తప్పు ఒప్పుకొన్నాడు "అబద్ధం ఆడానండి."

అయితే ప్రసాదు. నీవూ........భార్యను గురించి అబద్ధం ఆడవచ్చునా?

ఆడకూడదు.

అయితే ఎందుకు అబద్ధమాడావూ? భార్యను చూద్దామని అంత ప్రాణం పీకిందా?

అదికాదండి.......

ఏదికాదోయ్? అది కాకపోతే సెలవు ఎందుకు అడిగావూ? నీ భార్యను

కథా నిలయం
శ్రీకాకుళం

చూడ్డానికి కాదూ?

కాదండి.

అయితే ఎవరిభార్యనైనా చూడటానికా?

కాదండి.

మరి ఏం చూద్దామని?

టెన్నిస్ మాచెస్ చూద్దామని?

'ఛీ ఛీ ఛీ ఛీ వెధవ మాచెస్ చూడటానికి సెలవు సంపాదించటానికి, భార్యకు జబ్బు చేసిందంటావు? భార్యను గురించి ఇల్లాంటి అమంగళ వాక్యం అంటానికి నీకు బుద్ధి ఎట్లా పుట్టింది? అందులో గర్భిణిగా ఉన్న ఆమె గదా?

గర్భిణిగా ఉన్నదన్నమాట కూడా అబద్ధమేనండి. ఆఫీసర్ ముఖం వివర్ణమైంది?

అబద్ధం అయితే ఇట్టే పట్టేస్తారు అని అతనికి పేరు ఉంది. ఇప్పుడు ఏమైంది? అతనే సిగ్గుపడవలసినంత పని జరిగింది.

గర్భిణిగా లేదూ? అయితే ఆసుపత్రికి ఎందుకు పంపావూ?

నేను పంపలేదండి – అసలు నాకు భార్య లేదండి. ఆసుపత్రిలో సుఖంగా ప్రసవిస్తూందన్నారు తమరు........

ఆ వాక్యం పూర్తి చెయ్యలేదు ప్రసాదు.

ఆఫీసరు తేరుకొని విరగబడి నవ్వాడు. నవ్వి ఇట్లా అన్నాడు, మిస్టర్ ప్రసాదు. వెళ్ళు తత్‌క్షణం వెళ్ళు. మాచెస్ రెండు రోజులు జరుగుతయ్యి. ఈ రెండు రోజులూ కూడా చూడు. సెలవిచ్చాను. కాని ఒక నెలరోజులు టైము ఇస్తాను. ఈ లోపున నీవు పెళ్ళి చేసుకోవాలె. అబద్ధం ఆడటానికి ఆ మాత్రం ఆధారం లేకపోతే ఎవరికైనా కష్టమే? తెలిసిందా?

ప్రసాదు తెలిసిందన్నట్లు తల ఊపి గబగబా వెళ్ళిపోయినాడు మాచెస్ చూడటానికి.

ఆఫీసరు కుర్చీలో జేరగిలబడి మళ్ళీ ఒకసారి విరగబడి నవ్వుకొన్నాడు.